# కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె

## కేబినెట్‌లోనే కీలక నిర్ణయం

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె కొనసాగుతోంది. గురువారం డిపోల ముందు ధర్నాలు చేపట్టారు. దీనిపై ఓ కీలక నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ సర్కారు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నవంబరు 2న ప్రగతి భవన్ లో సిఎం కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో 50 శాతం యాజమాన్యం బస్సులు, 30 శాతం అ÷-దదె, 20 శాతం ప్రైవేట్ స్టేజ్ కేరియర్లు ఉండాలని యోచిస్తోంది. ప్రైవేట్ స్టేజ్ కేరియర్లకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది. అలాగే సెట్విన్ సర్వీసుల సేవలు వినియోగించుకోవడం వంటి అంశాలను సర్కారు పరిశీలిస్తోంది. వీటితో పాటు మునిసిపల్ ఎన్నికలపై కూడా కేబినెట్ చర్చించనుంది.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 1-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 82 | పేజీలు: 4 | వెల: రూ.1/-




సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన ప్రధాని మోదీ

# పటేల్ కల నెరవేరింది

■ ఆర్టికల్ 370రద్దు ఆయనకే అంకితం

■ భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి గర్వకారణం

■ ప్రపంచంలోనే ఉగ్రవాదులకు కశ్మీర్ స్థావరంగా మారింది

■అరాచక శక్తులు అణిచివేసేందుకే ఆర్టికల్ 370 అమల్లోకి తెచ్చాం

■ మన ఐక్యతను దెబ్బతీయడానికి కొందరు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు

■ ఐక్యంగా వారికి కుట్రలను తిప్పికొండదాం

**- వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ**

గాంధీనగర్, అక్టోబర్31(ఆర్ఎన్ఎ): ఆర్టికల్ 370 రద్దు సర్దార్ వల్లభాయ్ పటేల్ కల అని, ఆయన కల నెరవేరిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బర్డోలీ వీరుడు, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఘన నివాళులర్పించారు. అనంతరం 'ఏక్తా దివస్' పరేడ్‌లో పాల్గొని ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఐక్యతే మన సంస్కృతి, సంప్రదాయం, కల అని ప్రధాని ప్రశంసించారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, వేషభాషలు మన దేశానికే ప్రత్యేకమని అన్నారు. ఐక్యత గురించి మన ఇతిహాసాలు సైతం విశదీకరించాయని, భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశానికి ప్రపంచదేశాల్లో గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. ఐక్యత, వైవిధ్యంలో మనం ఎప్పుడూ రాజీపడలేదని, భారత సమగ్రతకు పటేల్ విగ్రహం చిహ్నమని అన్నారు. దేశ ఐక్యత విషయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్గదర్శకాలను అనుసరించాలని, ఆయన వ్యక్తిత్వమే మనకు ఓ పవిత్రమైన సందేశమని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాలూ ఐక్యత కోసం పాటుపడుతున్నాయని, దీనిని కొనసాగించడం ఇప్పుడు భారత్‌కు సవాల్‌గా మారిందని అన్నారు. ఈ సవాల్‌ను మనమంతా స్వీకరించి ఐక్యతను నిలబెడతామన్న నమ్మకం తనకు ఉందని వ్యాఖ్యానించారు. మనపై యుద్ధం చేసి గెలవలేని వారు మన ఐక్యతను దెబ్బతీయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పటేల్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని, కుటిల యత్నాలు చేసే వారికి తగిన గుణపాఠం చెప్పాలని పరోక్షంగా పాక్‌ను మోదీ హెచ్చరించారు. ఒక్క జమ్మూకశ్మీర్‌లోనే ఆర్టికల్ 370 అమల్లో ఉండేదని, ఇది అక్కడ ఉగ్రవాదాన్ని పెంచిపోషించిందని మోదీ అన్నారు. స్వయం ప్రతిపత్తిని రద్దుచేసి భారత్‌ను ఒక్కటి చేశామని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలోనే ఉగ్రవాదులకు కశ్మీర్ స్థావరంగా మారిందని, ఉగ్రవాదం కారణంగా గత మూడు దశాబ్దాల్లో 40వేల మంది ప్రాణాలు కోల్పోయారని, ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను పోగొట్టుకున్నారని చెప్పారు. అరాచక శక్తులను అణచివేయడానికే ఆర్టికల్ 370 రద్దు చేశామని, దీనిని పటేల్‌కు అంకితమిస్తున్నామని ప్రధాని తెలిపారు. కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దుచేయడంతోనే పటేల్ కల నెరవేరిందన్నారు. సమైక్యతా పూజారి పటేల్ జయంతి సాక్షిగా జమ్మూ కశ్మీర్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని అని మోదీ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్, లడఖ్‌లను వేరుచేసి కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టామని అన్నారు. పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశంలో భావోద్వేగ, ఆర్థిక, రాజ్యాంగ సమైక్యత దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రధాని వివరించారు.

# బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**- అక్కడికక్కడే మృతిచెందిన దంపతులు**

హైదరాబాద్, అక్టోబర్31 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్ శివారులోని పెద్ద అంబర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద గురువారం ప్రమాదం సంభవించింది. ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన బస్సు టూవీలర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ మీద వెళ్తున్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తుని నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మరణించిన వారిని కోహెడ గ్రామానికి చెందిన రమణారెడ్డి, విజయమ్మగా గుర్తించారు. రమణారెడ్డి బండ్లగూడ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని సమాచారం. తమ బంధువుల గృహ ప్రవేశ వేడుక కోసం భార్యతో కలిసి బైక్ మీద కోహెడ నుంచి అబ్దులాపూర్‌మెట్ బయల్దేరారు. పెద్ద అంబర్ పేట వద్ద ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా వీరు వెళ్తున్న బైక్ పైకి దూసుకెళ్లింది. దీంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కేసు నమోదు చేసిన పోలీసులు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రమణారెడ్డి దంపతుల మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆర్టీసీ కార్మికులు, స్థానికులు ఆందోళనకు దిగారు. ప్రమాద వార్త తెలియడంతో ఆర్టీసీ జేఏసీ నాయకులతో పాటు కార్మికులు భారీ సంఖ్యలో పెద్ద అంబర్ పేటకు చేరుకున్నారు. విజయవాడ హైవే దిగ్భంధం చేశారు. రమణారెడ్డి కుటుంబానికి వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# నిబద్దత తో పని చేయాలి

**పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి**

**ప్రొబేషనరీ ఎస్ఐలకు సిపి సజ్జన్నార్ హితవు**

హైదరాబాద్,అక్టోబర్31 (ఆర్ఎన్ఎ): తెలంగాణ పోలీస్ అకాడమిలో శిక్షణ పూర్తి చేసిన 15 మంది నూతన ప్రొబేషనరీ సబ్- ఇన్ స్పెక్టర్లు బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ని కలిసి పోస్టింగ్ల కోసం రిపోర్ట్ చేశారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం ప్రతి ఒక్కరిలో ఉండాలని కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐలకు సూచించారు. పోలీస్ శాఖ పై ఎంతో నమ్మకంతో ప్రజలు వస్తారని వారి నమ్మకానికి తగ్గట్టుగా వారికి న్యాయం చేస్తూ మేమున్నామని భరోసా ఇవ్వాలని అన్నారు. నిబద్ధత, అంకిత భావం, క్రమశిక్షణ తో పని చేయాలన్నారు. ప్రజలందరినీ సమానంగా చూడాలన్నారు. బంధుప్రీతి, పక్షపాతం చూపరాదన్నారు. పోలీసింగ్ లో సాంకేతిక వినియోగం, నేరాల అదుపు, బందోబస్తు చర్యలు, కేసుల దర్యాప్తు, కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు చేయాలని అంశాలతోపాటు విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు తదితర అంశాలపై సిపి గారు ఎస్ఐలకు అవగాహన కల్పించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ టెక్నాలజీ తో ప్రజలకు మరింత దగ్గరవ్వాలని పోలీస్ శాఖ కు మంచి పేరు తీసుకురావాలని సిపీ కొత్త ఎస్ఐలకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి ఎస్ ఎమ్ విజయ్ కుమార్,, విమన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి అనసూయ, సైబరాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ మాణిక్ రాజ్, అడ్మిన్ ఆర్ ఐ విష్ణు ఉన్నారు.





పాకిస్తాన్‌లో రావల్పిండి వెళుతున్న రైలు మంటల్లో దగ్ధమైన బోగీలు

# పాక్‌లో ఘోర రైలు ప్రమాదం

**- గ్యాస్ సిలిండర్ పేలడంతో వ్యాపించిన మంటలు**

## 65మంది ప్రయాణీకులు మృతి

**మరో 30మందికి గాయాలు**

**- మృతుల సంఖ్య పెరిగే అవకాశం**

**- కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న పలువురు**

**- సహాయక చర్యలు ముమ్మరం**

**- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్**

ఇస్లామాబాద్, అక్టోబర్31(ఆర్ఎన్ఎ) : పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. కరాచీ నుంచి బయలుదేరిన తేజ్‌గామ్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం ఉదయం భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. తల్వారీ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత లియాఖత్‌పూర్ ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మూడు బోగీలకు మంటల వ్యాపించాయి. ఈ హఠాత్ ఘటనతో పలువురు రైలు దూకి ప్రాణాలు దక్కించుకోగా.. 65మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 30మంది ప్రయాణీకులు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వివరాల్లోకి వెళితే.. కొంతమంది ప్రయాణికులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరు అనేక మంది సామాన్యుల ప్రాణాలు బలిగొంది. పాకిస్థాన్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి ప్రయాణికుల తప్పిదమే కారణమని తెలుస్తోంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. తాజాగా.. ఆ సంఖ్య 65కు చేరింది. మరో 30మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రత భారీ స్థాయిలో ఉండడంతో మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. మంటలు ఏకంగా మూడు బోగీలకు వ్యాపించడంతో ప్రాణ నష్టం భారీ స్థాయిలో ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ స్టవ్‌పై అల్పాహారం తయారుచేసుకుంటుండగా సిలిండర్ పేలి ప్రమాదం సంభవించిందని పాక్ రైల్వే శాఖ మంత్రి షేక్ రషీద్ వెల్లడించారు. దీంతో మంటలు ఒక్కసారిగా పక్క బోగీలకు వ్యాపించాయన్నారు. ఇంకా చాలా మంది ప్రయాణికులు రైలు నుంచి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉండడంతో సైనిక బలగాలు సైతం రంగంలోకి దిగాయి. పరిస్థితి విషమంగా ఉన్నవారిని హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దుర్ఘటనపై ఆ దేశ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ స్పందించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోలను స్థానికులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

## సమస్యలు నా దృష్టికి తీసుకురండి..

# పరిష్కారానికి కృషి చేస్తా

■ డాక్టర్‌లా తెలంగాణను చూసుకుంటా

■ మూడు నెలల్లో తెలుగులో మాట్లాడుతా

**- తెలంగాణ గవర్నర్ తమిళిసై**

హైదరాబాద్, అక్టోబర్31(ఆర్ఎన్ఎ) : మీకేమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని.. వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. ముషీరాబాద్ కాషిష్ కన్వెన్షన్ సెంటర్‌లో జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను స్వతహాగా డాక్టర్‌ను అని డాక్టర్‌లా తెలంగాణ రాష్ట్రాన్ని చూసుకుంటానని తమిళిసై అన్నారు.

తెలంగాణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. తానూ సాధారణ మహిళనేనని, బంగారం, చీరలంటే ఇష్టమని చెప్పుకొచ్చారు. మహిళలకు చీరలు, బంగారం ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతే ముఖ్యమని పేర్కొన్నారు. చీరల సెలక్షన్‌కే కాదు యోగాకు కూడా సమయం కేటాయించాలని సూచించారు. ఎంజాయ్ అంటూ సీరియల్స్ చూడొద్దని.. టైమ్ వృథా చేసుకోవద్దని మహిళలకు తమిళిసై హితవు పలికారు. మహిళలు ప్రతిరంగాన్ని సవాల్‌గా తీసుకుని ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని అందులో నైపుణ్యం సాధించాలని ఆమె సూచించారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడం కూడా మహిళలకు ఎంతో అవసరమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొలుత తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆమె.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మరో మూడు నెలల్లో పూర్తిగా తెలుగులోనే మాట్లాడేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మహిళా పక్షపాతి అని, మహిళల కోసం మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. తన తల్లి పడ్డ కష్టాలు మహిళలు పడకూడదని ఉజ్వల గ్యాస్ పథకం తీసుకొచ్చారని గుర్తుచేశారు. ముద్ర పథకం ద్వారా లబ్ది పొందిన వారిలో 70శాతం మహిళలున్నారన్నారు. ఉద్యోగం వెతుక్కోవడం కాదు.. ఉద్యోగం ఇచ్చే స్థాయికి మహిళలు ఎదగాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు లక్ష్మణ్‌తో కలిసి గవర్నర్ తమిళిసై ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు ముద్ర రుణాలు తీసుకోవచ్చునని లక్ష్మణ్ తెలిపారు. అలాగే మిగతా మహిళలు కూడా శిక్షణ తీసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

# హనీట్రాప్ వలలో బిజినెస్ మేన్

**వ్యాపారిని బెదిరించిన ఎయిర్‌హోస్టెస్**

**20లక్షల నగదు..కోటికి బాండ్**

**దంపతులను అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): హానీ ట్రాప్ కేసులు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. అందాలతో ఎర వేయడం, ముగ్గులోకి దింపడం.. తర్వాత వీడియోలతో బ్లాక్ మేయిల్ చేసి డబ్బులు కాజేయడం ప్రస్తుతం ఆన్ లైన్ మోసాల్లో ఇదొకటి. లేటెస్ట్ గా హైదరాబాద్‌లో హనీ ట్రాప్ జరిగింది. ఓ ఎయిర్ హోస్టేస్(కనిష్క) వ్యాపారవేత్తకు వేసి లక్షలు దండుకుంది. తన అందాలతో వ్యాపార వేత్తను ముగ్గులోకి దింపి తనతో గడిపేలా చేయడంతో పాటు, ఆ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించింది.

వ్యాపార వేత్తను రిసార్ట్‌కు రమ్మని చెప్పి,తన భర్త సహాయంతో గన్ తో బెదిరించింది. దీంతో ఆ వ్యాపారి రూ.20 లక్షలు ఇచ్చుకున్నాడు. మరో కోటి రూపాయలకు బాండ్ కూడా రాయించుకుంది. దీంతో చేసేదేం లేక ఆ వ్యాపారి సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ లోపే ఆ కిలాడీ మరో ఎన్ఆంఐని టార్గెట్ చేసింది. దీంతో పోలీసులు కనిష్క దంపతులను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. హనీ ట్రాప్ కేసులో పట్టుబడ్డ ఎయిర్ హోస్టెస్ కనిష్క ఆమె భర్త విజయ్ కుమార్ హోటల్ బిజినెస్‌లో నష్టాలు రావడంతో ఇలా ఈజీ మనీ కోసం బడాబాబులను టార్గెట్ చేస్తున్నారు. అలానే ఆ వ్యాపార వేత్తతో పరిచయం పెంచకున్న కనిష్క అతనిని వలలోకి దింపింది. ఒక రోజు ఇన్వెస్టిమెంట్ పేరుతో వ్యాపార వేత్తనుంచి రూ. 10లక్షలు తీసుకుంది. వ్యాపార వేత్తకు మత్తు కలిపి చనువుగా ఉన్నట్లు ఫోటోలు, వీడియోలు తీసింది. ఓ రోజు రిసార్ట్‌కు రమ్మని ఆ వీడియోలు చూపించి తన భర్త సహాయంతో డమ్మీ గన్ తో ఆ వ్యాపార వేత్తను బెదిరించారు. అతని నుండి వాళ్లు మరో రూ.10 లక్షలు తీసుకున్నారు. మరో కోటి రూపాయలకు బాండ్ కూడా రాయించుకున్నారు. దీంతో ఆ వ్యాపార వేత్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యాపారిని బెదిరించిన ఎయిర్‌హోస్టెస్ దంపతులను నగరంలోని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో గల ఈ తతంగం జరిగింది. కాగా ఎయిర్‌హోస్టెస్ ఆ దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో రహస్యంగా చిత్రీకరించింది. వాటిని చూపించి ఎయిర్‌హోస్టెస్ దంపతులు వ్యాపారిని బెదిరింపులకు గురిచేశారు. వ్యాపారి నుంచి రూ.20 లక్షలు వసూలు చేశారు. ఆనక మరో కోటి రూపాయలకు ఒప్పంద పత్రం రాయించుకున్నారు. దీంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించిన ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎయిర్‌హోస్టెస్ దంపతులను అరెస్టు చేశారు.

# నిరుపేద ఆరోగ్యానికి భరోసా

**రెండు లక్షలు మంజూరు చేయించిన మంత్రి కొప్పుల**

హైదరాబాద్,అక్టోబర్31 (ఆంఎన్ఎ): అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ నిరుపేద యువకుడికి మంత్రి కొప్పుల ఈశ్వర్ 2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన అజయ్ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు.

అతడి కుటుంబం పూట గడవని నిరుపేద కుటుంబం. చికిత్స చేయించుకోవడానికి వారి దగ్గర డబ్బు కూడా లేదు. దీంతో ఆ యువకుడు సాయం కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆశ్రయించాడు. వారి పరిస్థితి అర్థం చేసుకున్న మంత్రి చికిత్స నిమిత్తం ముందస్తుగా రూ. 2 లక్షల ఎల్ ఓ సీ మంజూరు చేయించి భాదితుడికి అందజేశారు. ధైర్యంగా ఉండాలనీ, మీకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి బాలుడికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ యువకుడు మంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ధవళయశో సంపద గల
ప్రవిమల వాఙ్మయ నిధిని తెలంగాణాత్మున్
కవనములో స్తుతియించెద
నవపాలన 'వట్టి కోట' ఆళ్వారు స్వామిన్!!

( నవంబర్ 1 వట్టికోట ఆళ్వార్‌స్వామి జననం)



-రాధశ్రీ

సెల్: 9494481210

# రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

బెంగళూరు,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): కర్నాటకలోని తుముకూర్ జిల్లా కోరాట్‌గిర్ ప్రాంతంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడడంతో ఐదుగురు మృతి చెందగా 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలుగు నటి గీతాంజలి కన్నుమూత



**గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి**

**సినీ ప్రముఖుల సంతాపం**

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): తెలుగుతెరకు సీతగా పరిచయమైన గీతాంజలి ఇకలేరు. ఎన్టీఆర్ ఏరికోరి సీతగా ఎంచుకున్న సతీతగా గీతాంజలి సీతారామ కళ్యాణం సినిమాతో తెరంగేట్రం చేసి అద్భుత నటిగా రాణించారు. అలాంటి టాలీవుడ్ సీనియర్ నటి గీతాంజలి గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమెకు గుండెపోటు రావడంతో ఫిలింనగర్ లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె అనారోగ్య పరిస్థితి విషమించడంతో కన్నుమూసిందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో గీతాంజలి జన్మించారు. వివిధ భాషలలో ఆమె 500 పైగా చిత్రాలలో నటించారు. నటుడు రామకృష్ణను పెళ్లి చేసుకున్నారు. ఎన్టీఆర్ నటించిన సీతారాముల కల్యాణం, కలవారి కోడలు, డాక్టర్ చక్రవర్తి, లేతమనసులు, బొబ్బిలి యుద్ధం, ఇల్లాలు, దేవత, కాలంమారింది, సంబరాల రాంబాబు, పూలరంగడు, గ్రీకువీరుడు, దటీజ్ మహాలక్ష్మి వంటి ఎన్నో ప్రముఖ చిత్రాల్లో ఆమె నటించి ప్రేక్షకులను అలరించారు. గీతాంజలి అసలు పేరు మణి. సనియర్ నటి గీతాంజలి మరణంపై పలువురు నటులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసారు. తొలితరం సీతగా, తెలుగు హాస్య ప్రధాన చిత్రాల్లో ముఖ్య నాయికగా ప్రేక్షకులను అలరించారని ఆమెను గుర్తు చేసుకున్నారు. ఆమె మృతి ఇండస్ట్రీకి తీరని లోటని అన్నారు. గీతాంజలి మరణంపై అగ్రహీరో బాలకృష్ణ సంతాపం ప్రకటించారు. గీతాంజలి గారు పరమపదించారనే వార్త తెలియగానే షాక్ అయ్యానని ఆయన తెలిపారు. 'ఎప్పుడు కలిసినా అప్యాయంగా పలకరించేవారు. మా కుటుంబంతో మంచి అనుబంధం ఉన్నవారిలో ఆమె ఒకరు. నాన్నగారంటే ఆవిడకు ఎంతో అభిమానం. నాన్నగారు డైరెక్ట్ చేసిన 'సీతారామ కళ్యాణం' సినిమాలో సీత పాత్రలో గీతాంజలి గారు నటించారు.

# సర్వవేదానుసారం - 'ఓం'కారనాదం..

నేటి నిజం
శుక్రవారం 1-11-2019

వేదాలు ఉపనిషత్తులు ఓంకారాన్ని తపస్సుగా,ధ్యానంగా ఘోషిస్తున్నాయి. ఓంకారాన్ని సాధన చేయండని ప్రేరేపిస్తున్నాయి. ఓం స్మర, ఓం స్మర ఓంకారాన్ని స్మరించమని యజుర్వేదమాదేశించింది. ఓంకారాన్ని స్మరించడం వలన, కీర్తించడంవలన, జపించడం వలన, శ్రవణం చేయడం వల్ల మానవుడు పరమాత్మను పొంది తీరుతాడని అందువల్ల ఓంకార పరాయణువు కమ్మని శాస్త్రాలు శాసిస్తున్నాయి. ప్రణవాన్ని ఉపాసించడం వలన పరమాత్మ సాక్షాత్కరిస్తుందని వేదాలు చెబుతున్నాయి. ఓంకారోరాసన మృత్యు విముక్త చేసి పరమేశ్వర సాక్షాత్కారం కలిగిస్తుంది. ఓంకారోపాసకునికి ఐహికాముష్మికములన్నీ సిద్ధిస్తున్నాయి. ఓంకారోపాసన వలన పరమానందాన్ని పొందవచ్చు. ఓంకారోపాసకుని ప్రతి అవయవంలోనూ శక్తి నిక్షేపముంది కాబట్టి శత్రువులెవరు అతనిని ఎదరించడానికి సాహసించరు. ఒకవేళ సాహసంతో ఎదిరిస్తే నశించి తీరుతారు. ఓ మహాత్మా! జీవితమంతా ఓంకారాన్ని ధ్యానించువారే లోకాన్ని చెందుతున్నారని తెలియచెప్పవలసిందని సత్యకాముడు పిప్పలాద మహర్షిని అడిగాడు. అపుడు మహర్షి ఓ సత్యకామా! ఈ ఓంకారము పరబ్రహ్మము. అపరబ్రహ్మము ఇదే! దీని తత్వాన్ని తెలుసుకున్నవారు పరమాత్మను పొందుతున్నారు. ఒక మాత్ర కాలంలోనే ఉచ్చరించే ఓంకారాన్ని ధ్యానించే వారు అచిరకాలంలో భూతలంలో కనిపిస్తున్నారు. ఋగ్వేదం లోని ఋక్కులు అతన్ని మానవజన్మలోనే పుట్టిస్తుంటాయి. అతడు బ్రహ్మ చర్యాన్ని పాటించడం వలన మహామహిమ కలవాడగుచున్నాడు. రెండు మాత్రల కాలంలో ఓంకారాన్ని ధ్యానించునట్లైన చంద్రలోకాన్ని చేరుతున్నాడు. యజుర్వేద మంత్రాలు వారినక్కడికే కొనిపోతున్నాయి. వారక్కడ సమస్త భోగాలను అనుభవించి మరల భూలోకాన్ని చేరుతున్నాడు. మూడు మాత్రల కాలంలో ఉచ్చరించే ఓంకార పరమేశ్వరుని నిరంతరం ధ్యానించేవారు తేజోమయమయిన సూర్యలోకాన్ని చేరుతున్నారు. కుబుసాన్ని విడచిన పామువలె సమస్త పాప విముక్తులై సామవేద సాతు శాస్త్రాలతో బ్రహ్మ లోకాన్ని పొందుతున్నాడు. ఇలా ఓంకారంలోని మూడు మాత్రలు పరస్పరం సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఇటువంటి ఓంకారాన్ని దృఢసంకల్పంతో ధ్యానించినంతనే పరమేశ్వరుణ్ణి చేరుతున్నారు. ఓంకారం నుండి మంగళ ప్రదనాదం వెలువడుతుంటుంది. ఓంకారం శాశ్వత బ్రహ్మము. దాని ప్రభావాన్ని స్పష్టపరిచేది ప్రపంచమే! ఓంకారంతో సామగానం చేస్తున్నారు. ఓంకారాన్ని ఉచ్చరిస్తూ దర్శనాది శాస్త్రాలు చదువుతున్నారు. ఓం అంటూ అధ్వంస్యపుప్రతిగిర మంత్రాన్ని ప్రారంభిస్తున్నాడు. ఓం అనే ప్రేషతో బ్రహ్మ యజ్ఞాన్ని ప్రారంభించడానికి అనుమతి ఇస్తున్నాడు. ఓంకారాన్ని ఉచ్చరిస్తూ వేదాధ్యయాన్ని ఆరంభించే బ్రాహ్మణుడు ఓంకార ప్రభావంతో పరబ్రహ్మను పొందుతున్నాడని, చేరుకోగలుగుతున్నాడని తైత్తిరీయ శీక్షావల్లి చెబుతూంది. పవిత్రాత్ములయిన ఓంకార సంబంధమయిన జ్ఞానమునకు విరుద్ధాలైన విజ్ఞానమంతా తిరస్కరించదగినదే అన్నాడు శ్రీరామతీర్థస్వామివారు. ఇది వాఙ్మయమే కాకుండా ఎందరో మహాత్ములను సందర్భానుసారంగా సృష్టించగలిగినది..

## నిధులు,విధులు బదలాయింపు చేయండి

### -సర్కార్‌ను కోరుతున్న సర్పంచ్‌లు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో పంచాయితీల బలోపేతం గురించి మాట్లాడుతున్న సిఎం కెసిఆర్ ముందుగా ప్రస్తుత పంచాయితీలకు నిధులు, విధులు బదిలీ చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. విధులే తప్ప నిధులు లేని ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలను తయారు చేశారని అన్నారు. గ్రామాల్లో ఏ పని జరగాలన్న పైనుంచి జోక్యం తప్పడం లేదన్నారు. తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పంచాయతీల్లో మౌలిక వసతులు, నీటి సంరక్షణ చర్యలు, ఉపాధి అవకాశాల పెంపు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం గుర్తించడం లేదన్నారు. గ్రామ పంచాయతీలకు 29, పట్టణ సంస్థలకు 18 అధికారాలు బదలా యించాల్సిందిగా మార్గదర్శకాలు ఉన్నప్పటికి అలా జరగటం లేదన్నారు. పనులు సవ్యంగా సాగక, చేసిన పనులకు సరైన సమయంలో డబ్బులు విడుదల కాక, అధికారుల మితిమీరిన జోక్యం, గ్రామైక్య భావన లేకపోవడం లాంటి వాటి ద్వారా గ్రామ స్వపరిపాలన కాగితాలకే పరిమితమవుతున్నదన్నారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే కాకుండా గ్రామ సభల నిర్వహణ, సభ్యుల భాగస్వామ్యం ఎక్కువ శాతం ప్రస్తుతం తంతు లాగా జరుగుతున్న తీరును మార్చేందుకు సాంకేతిక పరిజ్ఞానం వాడుక, ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. వీలైనంత వరకూ గ్రామ సభ, గ్రామ పంచాయతీ కౌన్సిల్ జరుగుతున్న తీరును రికార్డు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ పథకాల వినియోగంలో, గ్రామాభివృద్ధిలో బాగా రాణించే గ్రామ పంచాయతీ, సభ్యులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

## భక్తులతో కిటకిటలాడిన సాయి క్షేత్రాలు

### -పుట్టలో పాలుపోసిన మహిళలు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా సాగాయి. పుట్టల్లో పాలు పోయడానికి మహిళలు పోటీ పడ్డారు. వేకవ జామునుంచే పుట్టలో పాలుపోసే కార్యక్రమాలు సాగాయి. అలాగే పుణ్యక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ప్రధాన ఆలయాలు కిలకిటలాగాయి. కార్తీకమాసం తొలి గురువారం కావడంతో శైవాలయాలు కిటకిటలాడాయి. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయినమాస్మరణతో ఆలయాలుమార్మోగాయి. కార్తీక గురువారం పురస్కరించుకుని శైవాలయాల్లో అభిషేకాలు చేపట్టారు. పుణ్యతీర్థాల్లో నదీస్నానాలు, సముద్ర స్నానాలు చేసిన భక్తులు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో మహిళలు పుట్టలో పాలుపోసి పూజలు నిర్వహించారు. సాయి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పవిత్ర స్నానాలు చేసిన మహిళలు శివాలయంలో పెద్ద ఎత్తున్న వత్తులు వెలిగించే కార్యక్రమం చేశారు. పలుచోట్ల గోమాతలకు పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, ప్రత్యేక ఆరాధనలు చేశారు. ప్రజలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు పోటెత్తారు. సముద్ర, నదీతీరాల్లో భక్తుల కోలాహలం కనిపించింది. విజయవాడలో కృష్ణాతీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాస వేడుకల్లో భాగంగా ప్రాచీన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాలైన వేములవాడ రాజన్న ఆలయం, కాళేశ్వరం,కీసర, ధర్మపురి, వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి,రామప్ప ఆలయం, కొడవటూరు ఆలయాలకు భక్తుల పోటెత్తారు. గోదావరి తీరాల్లో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో తెలంగాణవ్యాప్తంగా ఉన్న అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గోదావరి తీరంలో ఉన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బాసరలో ప్రత్యేక పూజలకు తరలివచ్చారు. ఉదయాన్ని పుణ్యస్నానాలు ఆచరించి శివుడికి అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసంలో జరిగే పుణ్యస్నానాలను పురస్కరించుకొని ఘాట్ల వద్ద అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గోదావరి మాతకు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి స్నానాలు ఆచరించారు.

## ప్రతి పథకం ప్రజలకు చేరాలి

### కాళేశ్వరం నీరు చెరువులకు చేరేలా చూడాలి

### జడ్పీ తొలి సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్,అక్టోబర్31(నేటినిజంప్రతినిధి): ప్రతి ప్రభుత్వ పథకం లబ్దిదారులకు చేరేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి ఎకరాకు నీరు అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో నిర్మించిన ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని చెరువుల్లో నింపే విధంగా కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మతులు అవసరమైన కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు అధ్యక్షతన బుధవారం పరిషత్ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడినది కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే ప్రతి పథకం లబ్దిదారులకు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విషయంలో కఠినంగా ఉండాలన్నారు. నకిలీల వల్ల ఏ రైతు నష్టపోకుండా చూడాలన్నారు. ఒకవేళ ఇప్పటికే నష్టపోయినై÷-లటెతే వారికి పరిహారం అందించాలన్నారు. కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్ నాయక్, సీతక్క, కలెక్టర్ శివలింగయ్య, జడీ సీఈవో సన్యసయ్య, జడీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జిల్లాలో పర్యటిస్తున్న మంత్రికి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జిల్లాలోని కాలువలో నీరు సరిగా రావడం లేదని, కొన్ని మరమ్మతులు చేయాలని స్థానికులు మంత్రికి విన్నవించారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం తానంచర్ల గ్రామంలోని గంగా భవాని గుడిలో పూజలు చేశారు. అక్కడి నుంచి తానంచర్ల గ్రామం, వాల్యా తండాలో పిడుగుపాటుకు గురై చనిపోయిన తండ్రి, కొడుకులు కిషన్ తేజావత్(41), సంతోష్ తేజావత్(14) కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి, వారికి తన సానుభూతి తెలిజేశారు. వారి కుటుంబాన్ని పూర్తిగా ఆదుకుంటామని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం వెంటనే అందేలా అధికారులను ఆదేశించారు. వారి వ్యవసాయ భూమికి వెంటనే పట్టాలు ఇప్పిస్తాననీ, వారికి రైతు బంధు పథకం వర్తిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. తండ్రి కొడుకులు మరణించినందున వారికి ఆపద్బంధు పథకం కింద 12 లక్షల రూపాయల ఆర్థిక సాయం కూడా అందుతుందని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం జాల్ తండాలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మరొక కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందనీ, ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భర్తను కోల్పోయిన మహిళకు తగిన న్యాయ సాయం అందించాలని పోలీసులను ఆదేశించారు. తదనంతరం చిన్న గూడూరులో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రాజు తల్లి చనిపోవడంతో ఆమెకు నివాళులు అర్పించిన మంత్రి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యాన్ని కోల్పోవద్దని, తాను అండగా ఉంటానని రాజుకు మంత్రి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే శంకర్నాయక్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

# బంగారంతో చెలగాటం

హైదరాబాద్, అక్టోబర్ 31:బంగారానికి భారతీయులకు విడదీయరాని బంధం ఉంది. తిండికి గతిలేని వారు సైతం తాళిబొటట్ఉకోసం పిసరంత బంగారాన్నయినా కొంటారు. దానిని అపురూపంగా చూసుకుంటారు. పేద మధ్య తరగతి వారు తమ తాహతకు తగ్గట్లుగా ఎంతోకొంత బంగారాన్ని ఆభరణాల కోసం కొనుగోలు చేస్తారు. ఇకపోతే ఉన్నత వర్గాలు తమ తాహతను బట్టి రకరకాల ఆభరణాలను ధరిస్తారు. అలాంటి బంగారానికి ఇంతకాలం ధరల దరువు వల్ల సామాన్యులకు దూరంగా ఉంటోంది. తాజాగా కేంద్రం ఆలోచన అమల్లోకి వస్తే బంగారానికి లెక్కుందని తెలుస్తుంది. ఇక ఎంతపడితే అంత దాచుకునే వీలు ఉండదు. దేశ ప్రజల వద్ద గుప్తంగా ఉన్న బంగారం బండారం బయటపెట్టాలన్న కేంద్రం ఆలోచన ఇప్పుడు గుప్పుమంది. మొన్నటి వరకు నల్లధనం గుట్టు బయట పెడతారని అంటే అంతా ఓకే అన్నారు. కానీ అలాంటి ప్రయత్నం ఏదీ జరగలేదు. కానీ అప్పట్లో బంగారం లెక్కలు చెప్పాలని, లాకర్లు పగుల గొట్టి చూస్తారని ప్రచారం జోరందుకుంది. దీనిపై వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. అలాంటిదేమీ లేదని ప్రకటించింది. అయితే నిప్పులేనిదే పొగరాదన్నట్లుగా ఇప్పుడు మళ్లీ అలాంటి ప్రయత్నమే జరుగుతోంది. గుప్త బంగారం బయటికి రప్పించ దానికి నిర్ణీత గడువుతో కూడిన పథకాన్ని ప్రధాని మోడీ ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్నదని వచ్చిన వార్తలు భారీతీయుల గుండెల్లో రైళు పరుగెత్తేలా చేస్తోంది. ఆలయాలకు చెందిన స్వర్ణాన్ని ఉత్పాదక కార్యక్రమాలకు మళ్లించే ఆలోచన కూడా చేస్తున్నదని సమాచారం. ప్రభుత్వం ప్రకటించే గడువులోగా బయటపెట్టని బంగారంపై భారీ జరిమానాలు వసూలు చేస్తారని సైతం తెలుస్తున్నది. దేశంలో బ్లాక్ మనీని వెలికి తీయడానికి ప్రధాని మోడీ నాయకత్వంలోని గత ఎన్‌డిఎ ప్రభుత్వం 2016లో రూ. 500, 1000 నోట్లను అకస్మాత్తుగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ పథకం వల్ల ఆశించిన ఫలితం కలగకపోగా తీవ్రమైన ప్రతికూల పరిణామాలను దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోవలసి వచ్చింది.

దీంతో ఆర్థిక రంగం కుదేలయ్యింది. ఇప్పటికి కూడా అలి కోలకోలేదు. సరికదా జిఎస్టీ రాకతో పరిస్థితి ఇంకా దిగజారింది. ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు బంగారంతో చెలగాటం ఆడాలని మోడీ సర్కార్ చూస్తోంది. స్వచ్ఛంద స్వర్ణ వెల్లడి పథకానికి పూనుకుంటే ప్రజల్లో తీవ్రప్రతిఘటన తప్పేలా లేదు. పెద్ద నోట్ల రద్దును ప్రధాని మోడీ ప్రకటించినపుడు బంగారం రూపంలో గల గుప్త ధనాన్ని కూడా బయటకు రప్పిస్తారన్న ప్రచారం సాగింది. దీనిపై అప్పట్లో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో సర్కార్ వెనక్కి తగ్గింది. బంగారానికి, దేశ ప్రజల మనోభావాలకు గల అనుబంధాన్ని అవగాహన చేసుకోవాల్సి ఉంది. నోట్ల రద్దు తర్వాత సామాన్యులపై భారీ ప్రభావం చూపే అతి పెద్ద నిర్ణయం తీసుకునే దిశగా మోదీ సర్కారు అడుగు లు వేస్తోందన్న వార్త ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దేశంలో ప్రతి ఇంటా అంతో ఇంతో ఉండే బంగారంపై దృష్టి సారించింది. పరిమితికి మించి ఉన్న పసిడిపై పన్ను, జరిమానా విధించాలని భావిస్తోందని వార్తలు వచ్చాయి. అయితే పరిమితి అన్నది ప్రభుత్వం నిర్ణయించడంలో మతలబు ఉంది. ఆ పరిమితి ఎంతనే దానిపై స్పష్టత లేదు.

మహిళల నుంచి మదుపుదారుల దాకా అందరికీ ప్రియమైన వస్తువేదైనా ఉందంటే అది బంగారం ఒక్కటే! పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్ల ధనాన్ని బంగారం రూపంలోకి మార్చడం ఎక్కువైందని ప్రభుత్వం అనుమానిస్తోంది. అందుకే బంగారంపై మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం! మీ వద్ద ఎంత బంగారం ఉందో చెప్పాలి' అనే కొత్త నిబంధనను తీసుకురానున్నట్లు తెలిసింది. దీనిపై 'స్వచ్ఛంద వెల్లడి' పథకాన్ని ప్రవేశపెడుతుంది. నిర్దిష్ట గడువు ప్రకటించి ఆ లోపు ప్రతి ఒక్కరూ తమ వద్ద నిల్వ ఉన్న బంగారం వివరాలు బయటపెట్టాలని స్పష్టం చేయనుందని తెలుస్తోంది. అలాగే కొత్తగా కొన్న బంగారు కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చెప్పాల్సి ఉంటుంది. రసీదు లేకుండా బంగారం కొంటే భారీ జరిమానాలు తప్పవు. ఒక్కొక్కరు గరిష్ఠంగా ఎంత స్వర్ణం ఉంచుకోవచ్చు, పరిమితికి మించిన బంగారాన్ని స్వచ్ఛందంగా బయటపెడితే ఎంత పన్ను విధిస్తారు. నిజానికి ఇప్పటికే జిఎస్టీ కారణంగా కొనుగోళ్లపై ఆంక్షలు ఉన్నాయి. దీంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు బంగారం రకరకాలుగా చుక్కలు చూపిస్తోంది. అదో అపురూపమైన వస్తువుగా మారింది. వివాహమైన మహిళలకు సంబంధించిన నగలపై నిర్దిష్ట విలువ వరకు మినహాయింపు ఇస్తారు. విలువను ప్రభుత్వం గుర్తించిన నిపుణులు నిర్ధారిస్తారు. ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు ప్రతినిధులతో కలిసి 'గోల్డ్ బోర్డు' ఏర్పాటు చేస్తారు. బహుశా ఈ ఆర్థిక సంవత్సరంలోనే దీన్ని ఏర్పాటు చేసే అవకాశముందని అంటున్నారు. ప్రజలు బంగారు కొనుగోళ్లను కొనసాగించేలా ప్రోత్సహించడంపై ఈ బోర్డు దృష్టి సారిస్తుంది. ఇక... ప్రస్తుతం అమలులో ఉన్న 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని కూడా మార్చేస్తారు. దీనిని కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దుతారని అధికార వర్గాలు తెలిపాయి. గోల్డ్ బాండ్ పథకంలో అవిభాజ్య హిందూ కుటుంబం డీమ్యాట్ ఫార్మాట్‌లో గరిష్ఠంగా నాలుగు కిలోల వరకు బంగారు కొనవచ్చు. ట్రస్టులు 25 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. ఇలా కొన్న బంగారం విలువపై 2.5 శాతం వడ్డీ కూడా వస్తుందని తెలుస్తోంది.

## మొరార్జీ కాలంలోనే విఫలమైన స్వర్ణ పథకం

### సత్ఫలితాలు ఇవ్వని నియంత్రణ చట్టం

న్యూఢిల్లీ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): గతంలో బంగారంపై నియంత్రణలు ఉన్నా యి. ఓ సారి కేంద్రం ఇలాంటి నియంత్ర చటాన్ని తీసుకుని వచ్చింది. 1962లో చైనాతో యుద్ధం నేపథ్యంలో అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ స్వర్ణ నియంత్రణ చట్టాన్ని తీసుకు వచ్చారు. 1963లో 14 క్యారెట్ల పైబడిన బంగారు నగల తయారీని నిషేధించారు. 1965లో బంగారం బాండ్ల పథకాన్ని తెచ్చారు. ఆఖరి కి 1968 ఆగస్టులో దేశప్రజల వద్ద కడ్డీలు, నాణెళిలు రూపంలోని బంగారు నిల్వలను నిషేధించా రు. స్వర్ణకారుల వద్ద 100 గ్రా ములకు మించి బంగారం ఉండరా దని పరిమితి పెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు బంగారం నిల్వలకు గల విడదీయరాని బం ధాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలను తగు స్థాయి లో కాపాడుకోడం కోసం ప్రజల నుంచి బంగారాన్ని బయటకు రప్పించడానికి అప్పట్లో మొరార్జీ దేశాయ్ తీసుకున్న ఈ చర్యలు ఫలించకపోగా వేలాది స్వర్ణకార కుటుంబాలు వృత్తులు కోల్పోయి తీవ్రమైన వృత్తి సంక్షోభంలో చిక్కుకున్నారు. దేశ ప్రజలు తమ వద్ద గల మిగులు ధనాన్ని బంగారంలో పెట్టి ఆభరణాలు చేయించుకొని దాచుకోడమనే దానికి గాఢంగా అతు క్కొని ఉన్నారు. దేవాలయాలకు సంబంధించిన బంగారా నికైతే విశేష పవిత్రతను ఆపాదించి చూసుకుంటారు. వాస్తవానికి దేశంలో గృహస్థుల వద్ద, ఆలయాల్లోనూ గల అపారమైన స్వర్ణాన్ని బయటకు తెచ్చి ఉత్పాదక కార్యకలాపాలకు, దేశాభివృద్ధికి వినియోగించడమనే ఆలోచన ఎంతో సహేతుకమైనది. దీనిని సమర్థించదగినదే. 1933లో అమెరికాలోని ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ప్రభుత్వం ప్రజల వద్ద గల బంగా రాన్ని బయటకు రప్పించడానికి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఇటువంటి పథకాన్నే తీసుకు వచ్చి సఫలీకృతమయింది. అప్పుడు అమెరి కన్ ప్రజలు దేశభక్తితోనూ, శిక్షలకు భయపడి తమ వద్ద గల బంగారం నిల్వలను ప్రభు త్వానికి అప్పగించారు. మన దేశంలో మొరార్జీ దేశాయ్ స్వర్ణ నియంత్రణ చర్యలు తీసుకున్నప్పుడు ప్రజలు తమ వద్ద గల బంగారాన్ని బయటికి తీయడానికి బదులు దొడ్డి దారిలో దొంగ బంగారం కొనుక్కోడానికి ఆసక్తి చూపారు. వాస్తవానికి దేశ ప్రజల బంగారం దాహాన్ని తీర్చడానికి ప్రభుత్వం విశేషంగా విదేశీ మారకాన్ని ఖర్చు పెట్టి దానిని దిగుమతి చేసుకుంటున్నది. ఆయిల్ దిగుమతుల తర్వాత బంగారం రప్పించుకోడానికే అధికంగా విదేశీ మారకం ఖర్చువుతున్నది. దేశ ప్రజల వద్ద 25 వేల టన్నుల వరకూ గుప్త బంగారం ఉంటుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది. ప్రజలు సహకరిస్తే ప్రధాని మోడీ ప్రభుత్వ కొత్త యోచన సత్ఫలితాలనిస్తుంది. లేని పక్షంలో మరో విఫల పథకంగా చరిత్రకెక్కుతుంది. ఎవరి దగ్గర ఎంతుందో గుట్టు విప్పాల్సిందే అన్న ఆలోచన ఎంతవరకు సఫలీకృతం అవుఉతందన్నది కూడా అనుమానంగా ఉంది. పరిమితికి మించిన స్వర్ణంపై పన్ను.. నిర్దిష్ట గడువు తర్వాత భారీగా ఫైన్ విధిస్తే ప్రజలు ఎంతవరకు సహకరిస్తారన్నది చూడాలి. కొత్తగా కొనే పసిడి గురించీ చెప్పాలని, రసీదు లేకుండా కొంటే జరిమానా అన్నది ఇప్పటికే అమల్లో ఉంది. వివాహితల నగలకు కొంత మినహాయింపు ఇస్తామంటున్నారు. కేంద్రం మరో సంచలన నిర్ణయం పెద్దనోట్ల రద్దు లాగా ఫలిస్తుందా లేక వికటిస్తుందా అన్నది చూడాలి.

## అధికార పార్టీలో మున్సిపల్ జోరు

### టిక్కెట్ వేటలో ఛోటామోటా నేతలు

### ఎమ్మెల్యేలు, మంత్రులతో నేరుగా చర్చలు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో పాటు టిఆర్ఎస్ శ్రేణుల్లో ఇప్పుడు జోష్ నెలకొంది. ఎక్కడ చూసిని అధికార టిఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు ఆర్టీసీ కన్నా మున్సిపల్ ఎన్నికల చర్చలే సాగుతున్నాయి. ఆర్టీసీ సమస్యపై పెద్దగా చర్చించడంలేదు. మంచి అని కానీ చెడు అని కానీ అనకుండా తప్పించుకుంటున్నారు. మెల్లగా ఆశావహులు తమ దృష్టిని పురపాలకిలపై సారించారు. హుజూర్‌నగర్‌లో భారీ మెజార్టీ రావడంతో గులాబీ నేతల్లో ఆశలు పెరిగాయి. సమస్యలు ఎలా ఉన్నా ఎక్కడ పోటీ చేసినా గెలుపు తమదే అన్న భరోసాలో ఉన్నారు. మొత్తంగా ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గులాబీ పార్టీలో రాజకీయం రంజుగా మారుతోంది. టిక్కెట్ల కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వార్డ్ మెంబర్ నుంచి మేయర్ వరకు పదవులు ఆశించే వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. దీంతో తమ గాడ్‌ఫాదర్‌ల ముందు ఇదే ప్రస్తావన చేస్తున్నారు. టిక్కెట్లు తమకంటే తమకు ఇవ్వాలని నేతలంతా ఒత్తిడి పెంచడంతో ఏం చెయ్యాలో అర్థంకాక గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తలలు పట్టుకుంటున్నారని సమాచారం. అయినా పట్టువదలని విక్రమార్కుల్లో ప్రజల్లో కూడా పరపతి పెంచుకునే కార్యక్రమాల్లో పడ్డారు. వార్డుల్లో పడి ప్రజలతో కలివిడిగా తిరుగుతూ మీ ఓటు నాకే అంటూ అప్పుడే ప్రచారహోరు చేపట్టారు. ఇంతకాలం ఎదురుచూసిన మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. నవంబర్‌లోనే అని సిఎం కెసిఆర్ కూడా పక్కగా చెప్పేశారు. ఇంత కాలం ఈ అంశం కోర్టు విచారణలో ఉండటంతో వాయిదా పడుతూ వచ్చింది. చివరికి కొద్ది రోజుల క్రితమే ఎన్నికలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. దీంతో త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. నవంబర్ నెలాఖరు కల్లా మున్సిపల్ ఎన్నికలు పూర్తవుతాయని ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రకటించడంతో ఆశావహులకు జోష్ కలిగింది. దీంతో అధికార టీఆర్ఎస్ పార్టీలో టిక్కెట్ల పంచాయితీ మొదలయ్యింది. పార్టీ టిక్కెట్ దక్కించుకునేందుకు ఆశావహులు అన్ని రకాలుగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఒక్కో వార్డు నుంచి కనీసం పదిమంది నేతలైనా టిక్కెట్ కోసం రంగంలోకి దిగారు. వాళ్లంతా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లేదా పార్టీలో ముఖ్య నేతల వెంటపడుతున్నారు. టిక్కెట్ కోసం తమపై ఒత్తిడి పెరుగుతుండటంతో ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు.. మంత్రులు గుంభనంగా వ్యవహరిస్తున్నారు. అంతా అధిష్టానం ఇష్టం అన్న మాటలతో బుజ్జగిస్తున్నారు. మున్సిపల్ వార్‌లో టిక్కెట్లు ఆశిస్తున్న వారంతా మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారే కావడంతో వారిని నొప్పించకుండా దాటవేస్తున్నారు. ఇప్పుడు వారిలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఇప్పిస్తే మిగిలిన వారు తమపైన దుమ్మెత్తిపోసేలా ఉన్నారని ఎమ్మెల్యేలు.. మంత్రులు వాపోతున్నారన్న భయంలో ఉన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీజేపీల నుంచి గతంలో టీఆర్ఎస్‌లోకి చేరిన నాయకుల నియోజకవర్గాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉందట. అక్కడి ముఖ్య నేతల అనుచరులు టిక్కెట్లు ఇప్పించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో తమ నేతకే మున్సిపల్ ఛైర్మన్, మేయర్ పదవి ఇవ్వాలంటూ మంత్రుల చుట్టూ నేతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో ఉన్న మున్సిపాలిటీలతోపాటు కొత్తగా కొన్ని కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసింది సర్కార్. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్‌లలో వార్డ్ అభ్యర్థుల నుంచి మేయర్ పీఠం వరకూ పోటీదారులు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. అనేక ప్రాంతాల్లో నేతల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు వినతులు వెలుతున్నాయి. సొంత పార్టీలోనే పోటీదారుల సంఖ్య అతకంతకూ పెరగడం చూసి అధికార పార్టీ నేతలు కూడా తమ విజయం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అయితే వ్యయహారం అంతా అంతా అధిష్టానమే చూసుకుంటోందనీ చెప్పి తాత్కాలికంగా తప్పించుకుంటున్నారు. చివరకు ఎవరిది పైచేయి అవుతుందో అని స్థానిక ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

## సీసీ కెమెరాలతో నేరాలు అదుపులోకి

### - కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసుశాఖ వినియోగించుకోవాలి

### - మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### - ఆత్మకూరు పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి

వరంగల్, అక్టోబర్31(ఆర్ఎన్ఎ) : పోలీసుల సమర్థత, సీసీ కెమెరాలతో నేరాలు అదుపులోకి వస్తున్నాయని, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ప్రజల్లో మరింత భరోసాను నింపాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పోలీసు వ్యవస్థను కొత్తగా తీర్చిదిద్దారని అన్నారు. వాహనాలను, ఆధునిక సాంకేతిక వ్యవస్థను అందించారని, నేరస్థులకు ఇప్పుడు ఖచ్చితంగా శిక్ష పడుతోందన్నారు. పోలీసు శాఖ సవాలుగా తీసుకుని నేరాలను పూర్తిగా నియంత్రిత స్తున్నారని కొనియాడారు.

అవినీతి పరులను, భూ కబ్జాదారులను ఈ ప్రభుత్వం వది లిపెట్టదని మంత్రి హెచ్చరించారు. పరకాల నియోజకవర్గంలో నేరాలకు అడ్డుకట్ట పడిందని, పోలీసుశాఖ తీరు, ముఖ్యంగా వరంగల్ పోలీసుల తీరు అభినం దనీయమని అన్నారు. కేసీఆర్ పరిపాలనలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని మంత్రి తెలిపారు. తప్పు చేసినవారు తప్పించుకో లేరని, సీసీ కెమెరాలతో నేరాలను అదుపులోకి వస్తున్నాయని అన్నారు. కొత్త సాంకేతిక వ్యవస్థను పోలీసుశాఖ చక్కగా వినియోగిం చుకోవాలని మంత్రి సూచించారు.

హోంగార్డుల వేతనాన్ని నెలకు రూ. 12 వేల నుంచి రూ. 22 వేలకు పెంచామని, సీఎం కేసీఆర్ పోలీసుశాఖను అన్ని రకాలుగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పోలీస్ కమిషనర్ వి.రవీందర్, కలెక్టర్ ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

### ఉచితంగా సినిమా చుడండి: ట్రాఫిక్ పోలీస్

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): మెట్రో సిటీలో ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టం చేయడం కోసం నిబంధనలు పాటించేల చేయడం కోసం మన పట్టణ ట్రాఫిక్ పోలీస్ యంత్రంగం సరికొత్త ఆలోచనతో ముందుకు వెళుతుంది. ఇటీవల ఏర్పాటు చేసిన ఏ ఒక్క వాహనదారుడైతే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకుండ ఒక్క చాలను కూడా నమోదు చేయని వాహనదారులకు ఇప్పుడు సినిమా టికెట్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు ట్రాఫిక్ ఉన్నతాధికారులు వెల్లడించారు. అలాగే ప్రతినెలా వందమందికి పైగా ఇలాంటి వాహనదారులకు బహుమతులు ఇస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. అయితే కొందరు మేము ఎలాంటి ఉల్లంఘన చేయలేదని, ఇప్పటి వరకు ఒక్క చలన కూడా మా పైన నమోదు కాలేదని మాకు సినిమా టికెట్లు ఇవ్వాలని ట్రాఫిక్ అధికారులను అభ్యర్థించారు. కొందరైతే ఏకంగా ట్రాఫిక్ అదనపు డిసి అనిల్ కుమార్ ని సంప్రదించి వారికీ విషయాన్ని తెలియచేసి వారు బహుమతులకు అర్హులమని బహుమతులు, సినిమా టికెట్స్ ఇవ్వాలని సూచించారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీపీ వారికీ ఈ బహుమతులు అందేలా చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే వారి నుండి ఈ ప్రయోగం పైన సమాచారం సేకరించి ఇది మంచి ఫలితాన్ని ఇచ్చి ట్రాఫిక్ ఉల్లంఘన సమస్యలను కొంతైనా తగ్గించడానికి దోహదపడుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణం లో మొదటగా అవగాహనా పెంచటానికి వివిధ స్థలాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ వారి సిబ్బందికి అర్హులైన వాహనదారులను గుర్తించాలని వారికీ బహుమతులు మరియు సినిమా టికెట్స్ కూడా అందించాలని సూచించారు. కొందరు అర్హులను సినిమా టికెట్స్ మరియు బహుమతులు అందించి వారికి అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమం వేదికగా వాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ ధరించి వాహనం నడపాలని మరియు మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని హెచ్చరించారు.

## టిబిపై ప్రజల్లో అవగాహనా లోపం

### అదుకే మరణాలు సంభవిస్తున్నాయి: చౌబే

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): క్షయ (టిబి) వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కేంద్ర మంత్రి అశ్వినికుమార్ చౌబే పేర్కొన్నారు. కామినేని అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో క్షయ వ్యాధి (టిబి)పై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి అశ్వినికుమార్ చౌబే, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అశ్వినికుమార్ మాట్లాడారు. తెలంగాణలో ఏటా 12 వేల మంది క్షయ వ్యాధితో చనిపోవడం ఆవేదన కలిగించే విషయమని ఆయన చెప్పారు. మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ , టిబిపై ప్రజల్లో అవగాహన రావడం లేదని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ కూడా మాట్లాడారు. 2025 నాటికి భారత్ నుంచి టిబిని తరిమికొట్టాలని నిర్ణయించారని, అయితే అంతకుముందే తెలంగాణ నుంచి టిబిని తరిమికొట్టేలా చర్యలు తీసుకుంటున్నమని ఈటల తెలిపారు. టిబిపై అవగాహన లేకనే అనేకమంది మృత్యువాత పడుతున్నారని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందంర్ అన్నారు. ఏటా రాష్ట్రంలో 12 వేల మంది టీబీతో చనిపోతున్నారు. మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నా ప్రజల్లో అవగాహన లేదని, 2025 నాటికి భారత్ నుంచి టీబీని తరిమికొట్టాలని నిర్ణయించారు. తెలంగాణలో అంతకంటే ముందే టీబీని తరిమికొడతామని మంత్రి అన్నారు.

## నవంబరు 1న హుజూర్‌నగర్ లో కెటిఆర్ పర్యటన

### వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ఘనవిజయం సాధించిన తర్వాత కెసిఆర్ హుజూర్‌నగర్ వెళ్లి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా కృతజ్ఞత సభలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించాడు. కృతజ్ఞత సభలో పలు హామీలు ఇచ్చాడు. ఈ హామిలను నేరవేర్చటానికి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేయాలని నవంబర్ ఒకటిన హుజూర్‌నగర్ పర్యటనకు వెళ్లనున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులు గురించి మంత్రి జగదీశ్ రెడ్డి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, పలువురు నేతలతో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక పార్టీ ఇన్‌చార్జిగా పనిచేసిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, పార్టీ కార్మిక విభాగం రాష్ట్రం అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్ కెటిఆర్‌ను కలిసారు వారందరిని కెటిఆర్ అభినందించారు.

## భారత్‌ని సపోర్ట్ చేస్తే.. మా మిసైల్స్ దెబ్బ తప్పదు

### - పాక్ మంత్రి అలీఅమిన్ గండాపర్

ఇస్లామాబాద్, అక్టోబర్31(ఆర్ఎన్ఎ) : కశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు ఏఒక్క దేశం నుంచీ మద్దతు దొరక్కపోవడంతో ఫ్రస్టేషన్‌లో పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తోంది. భారత్‌కు ఏ దేశమైనా సపోర్ట్ చేస్తే తాము ఊరుకోమంటూ పాక్ మంత్రి అలీ ఆమిన్ గండాపర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ విషయంలో భారత్ వైపు నిలబడితే ఆ దేశాలను తాము శత్రువుగా చూస్తామని చెప్పారు. పాక్ నుంచి వచ్చే మిస్సైల్ ను ఎదుర్కొనేందుకు కూడా ఆ దేశాలు సిద్ధపడాలన్నారు. ఓ వైపు మంగళవారం కశ్మీర్ లో యూరోపియన్ ఎంపీలు పర్యటిస్తుండగానే.. పాక్ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మంగళవారం పాక్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను పాక్ జర్నలిస్ట్ నాయలా ఇనాయత్ తన ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. కశ్మీర్ విషయంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే పాక్ యుద్ధానికైనా సిద్ధంగా ఉందని ఆ దేశ మంత్రి అలీ అన్నారు. అయితే ఇది భారత్ పైనే కాదు, కశ్మీర్ అంశంపై ఇండియాను సపోర్ట్ చేసే ఏ దేశాన్నైనా తాము శత్రువుగానే భావిస్తామని చెప్పారు.

## బ్యాంకుల్లో బంగారంపై..

# మోదీ నజర్!

### నల్లధనాన్ని అరికట్టేందుకు కేంద్రం దృష్టి
### - బంగారం ఎక్కువుంటే ఇబ్బందులే
### - త్వరలో అమల్లోకి రానున్న గోల్డ్ ఆమ్నెస్టీ స్కీమ్?

న్యూఢిల్లీ, అక్టోబర్31(ఆర్ఎన్ఎ): పెద్ద నోట్ల రద్దుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ మళ్లీ ఇప్పుడు మరో సంచలనానికి సిద్ధమయ్యారు. నల్లధనాన్ని అరికట్టేందుకు ఈసారి బంగారాన్ని టార్గెట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గోల్డ్ ఆమ్నెస్టీ స్కీమ్‌ను ప్రకటించేందుకు రెడీ అవుతోందనే నివేదికలు వెలువడుతున్నాయి. ఈ స్కీమ్ అమలులోకి వస్తే.. నల్ల ధనాన్ని అరికట్టేందుకు మోదీ సర్కార్ తీసుకున్న రెండో అతిపెద్ద నిర్ణయం ఇదే అవుతుంది. 2016 డీమోనిటైజేషన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. వెలువడుతున్న నివేదికల ప్రకారం చూస్తే.. రశీదులేని బంగారం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే రేటు ప్రకారం దీనికి పన్ను చెల్లించాలి. గతంలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఆమ్నెస్టీ స్కీమ్ మాదిరిగా ఇప్పుడు గోల్డ్ ఆమ్నెస్టీ స్కీమ్ కూడా నిర్దేశిత కాలం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ కాలంలో బంగారం వివరాలను ప్రభుత్వా నికి తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో జరిమానాతో బయటపడొచ్చు. అదే స్కీమ్ కాలం ముగిసిన తర్వాత రశీదులేని బంగా రం మీ వద్ద బయటపడితే కఠిన చర్యలు ఉండొచ్చనే అంచనాలున్నాయి. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో బంగా రానికి ఒక నిర్దిష్టమైన పాలసీని తీసుకురా వాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే నీతి ఆయోగ్‌తోనూ కలిసి ముందుకు వెళ్తోంది. సమగ్రమైన గోల్డ్ పాలసీలో భాగంగానే ఇప్పుడు మోదీ సర్కార్ గోల్డ్ ఆమ్నెస్టీ స్కీమ్‌ను ప్రకటించనుందని జాతీయా మీడియా పేర్కొంటోంది. కొత్త చట్టం ప్రకారం ఒక కుటుంబానికి 4కిలోల కంటే ఎక్కువ బంగారం వుంటే దాన్ని కేంద్రం స్వాధీనపరచుకునే అవకాశాలున్నాయని తెలుస్తోంది. సంస్థలైతే 20 కిలోల బంగారం వరకూ వుంచేసుకోవచ్చు. నిర్దేశిత గడువులోగా తమ వద్ద ఉన్న బంగారం ఎంతో తెలియచెబితే ఓకే.. లేకపోతే భారీగా అపరాధ రుసుములను విధించేందుకు వీలుగా కొత్త చట్టం రూపొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా ఈ విధానంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేఖత వ్యక్తమవుతోంది. మరి మోదీ గోల్డ్ ఆమ్నెస్టీ స్కీంను అమల్లోకి తెస్తారా.. వెనక్కు తగ్గుతారా అనేది చూడాల్సిందే.

## వాడుకలో లేని బోరుబావులు తక్షణమే మూసివేయండి

### సుజిత్ ఉదంతంతో తమిళ సర్కార్ ఆదేశాలు

చెన్నై,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): తమిళనాడులో నెలకొన్ని బోరుబావిలో పడి మరణించిన సుజిత్ అనే చిన్నారి ఉదంతం ఆ రాష్ట్రాన్నే కాదు దేశాన్నే కదిలించింది. సుజిత్ లాంటి చిన్నారులు ఇలాంటి ప్రమాదాలకు బలైపోకుండా ఉపయోగించని బోరుబావులను, ట్యూబ్ బావులను వెంటనే పూడ్చివేయాలని, పాడుబడిన బోరుబావుల ద్వారాలను మూసివేసే చర్యలు తీసుకోవాలని తమిళాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుజిత్ విషాదం ప్రతి ఒక్కరికి వెంటాడుతోంది. ఇలాంటివి పునారావృతం కాకుండా నరిదిద్దే కార్యక్రమాలను తమిళనాడు రాష్ట్రం చేపట్టింది. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి రాష్ట్రంలో వాడుకలోనే బోరుబావులను మూసివేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సిఎం ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు, పార్టీ తరపున మరో రూ.10 లక్షల పరిహారాన్ని అందచేశారు. సుజిత్ మరణంపై ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో సిఎం పళనిస్వామి స్పందించారు. 2015లో జారీ చేసిన గెజిట్‌ను సూచిస్తూ జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. బోరుబావుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సిఎం హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా మోగిన జనభేరి

### సిఎం కెసిఆర్ మొండి వైఖరిపై మండిపడ్డ సకలజనులు
### ఆర్టీసీ సమ్మెను తక్షణం పరిష్కరించాలని డిమాండ్
### సరూర్‌నగర్ సభకు భారీగా హాజరైన కార్మికులు
### సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్షనేతలు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై తెలంగాణ ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని, లేకుంటే మూల్యం చెల్లించుచుకోక తప్పదని సకలజనుల భేరీ హెచ్చరించింది. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన సభలో విపక్ష నేతలు సిఎం కెసిర్ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కి నిరంకుశ పలన చేస్తున్న కెసిఆర్ పాలనపై విపక్ష నేతలు మండిపడ్డారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం ఆందోళన చేపట్టిన కార్మికులను బెదిరించడం మంచి పద్ధతి కాదన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సకల జనుల సమర భేరీ సభలో నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు.సీఎం కేసీఆర్ కార్మికులను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తున్నారని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ఆరోపించారు. తెలంగాణ వస్తే అందరి బతుకులు బాగుపడుతాయని అనుకున్నామన్నారు. అయితే జరగలేదన్నారు. మన గమ్యం దూరంగా ఉందన్న అశ్వత్థామరెడ్డి అందరం కలిసి గమ్యాన్ని చేరుకోడానికి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు అని చెప్పి అందరినీ కేసీఆర్ మోసం చేశారని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి విమర్శించారు. ఆత్మగౌరవం కోసం తెలంగాణ అని చెప్పి.. కార్మికవర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ బాగుపడుతుందని చెప్పి.. తమను నట్టేటలో ముంచారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాలను కూడా కేసీఆర్ సర్కార్ బేఖాతరు చేసిందని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికుల గత నెలరోజుల నుంచి జీతాలు లేవని.. కానీ తమ సమస్యల సాధనం కోసం ఇబ్బందులు తప్పవన్నారు. తమకు మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలకు అశ్వత్థామరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు ఒక్కరే పాల్గొనలేదని,అందరితోపాటు తాము పోరాటం చేశామన్నారు. రామాయణంలో ఉడత రామునికి దారి చూపకుంటే రామాయణమే లేదన్నారు. ఉద్యమంలో ఉడత పాత్ర ఆర్టీసీ కార్మికులదన్నారు. జీతాలు ఇవ్వకున్నా ఏ ఒక్క కార్మికుడు సమ్మె నుంచి వెనక్కి తగ్గలేదని అశ్వత్థామరెడ్డి అన్నారు.

నిర్బంధాల మధ్య ఆర్టీసీ కార్మికుల సభ జరుపుకుంటున్నామని సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి అన్నారు . కార్మికుల మృతికి సీఎం కేసీఆర్ దే బాధ్యత అన్నారు. సకల జన భేరి సభకు హాజరైన ఆయన? ఆర్టీసీ కార్మికులు మీకు ఓట్లు వేయలేదా?వారి సమస్యలను పరిష్కరించాల్సిన మీది కాదా అని ప్రశ్నించారు. కార్మికులను ప్రభుత్వం మానసికంగా వేధించిందన్నారు. సమ్మెపై కోర్టు సీరియస్ అయినా ఇంకా స్పందించక పోవడం దారుణ మన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర వహించారన్నారు. ప్రజలకు రవాణా ఎంతో అవసరం అని వంద శాతం ఆర్టీసీ బస్సులు ఉండటంతో పాటు?ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. ప్రశ్నించే గొంతుకను అణచివేయలేరన్న చాడ? ఇప్పటికైనా చర్చలకు పిలవాలని లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్మికులకు సరైన న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని చాడ వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం కార్మికులు సమ్మెబాట పట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు అన్నారు. వారి డిమాండ్లు తీర్చాల్సింది పోయి.. బెదిరించడం ఏంటని ప్రశ్నించరు.

శ్రామికులు యూనియన్ పెట్టుకోవచ్చని, తమ సమస్యలపై పోరాటం చేయొచ్చని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. కార్మికులు ఏం తప్పు చేశారని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా లేకపోవడం బాధాకర మన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయమని, కార్మికులకు హైకోర్టు తీర్పు కూడా అనుకూలంగా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ లాంటి మొండి ముఖ్యమంత్రిని తన రాజకీయ జీవితంలో చూడ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు అన్నారు. ఉద్యమంలో ఉపయో గపడిన వారు.. ఇప్పుడు మంచి వారు కాకుండా పోయారా? అని ప్రశ్నించారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా కేసీఆర్‌కు సిగ్గు రాలేదన్నారు. ఎంత తొందరగా కార్మికుల సమస్యను పరిష్కరిస్తే.. అంత మంచిదన్నారు. వేల పుస్తకాలు చదివిన కేసీఆర్.. రాజ్యాంగం చదవకపో వటం బాధాకరమని, కార్మికుల జీతాల విషయంలో కూడా ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పటం దురదృష్టకరమని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో ఎలా విలీనం చేయాలో.. మీ మిత్రడు జగన్‌ను అడగాలని వీహెచ్ సూచించారు. కేసీఆర్ అబద్దాల సీఎం అని మాజీ ఎంపి,బీజేపీ నేత జితేందర్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తన అవసరాల కోసం కార్మికులను వాడుకున్నారని ఆరోపించారు. వారి కష్టాలతో అవసరం లేదు కానీఓట్లు మాత్రమే కావాలని ఆరోపించారు. కేసీఆర్ చెప్పే అబద్ధాలను ప్రజలను సహించబోరన్నారు. ఆర్టీసీని విభజన చేయకుంటే.. మీ సుట్టాలకు బంకులు ఎట్లా ఇచ్చావని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులు రాత్రనకా పగలనకా కష్టపడి పనిచేస్తున్నారన్న జితేందర్ రెడ్డి.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాల్సిందేనన్నారు. ఆర్టీసీ నష్టాల్లో ఉందన్న సీఎం కేసీఆర్ దివాలా దీసిన కేసీఆర్ ప్రభుత్వం అవసరమా అని ప్రశ్నించారు జితేందర్ రెడ్డి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తుంటే ఇక్కడ ఎందుకు చేయరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వారికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల గుండె ధైర్యాన్ని ప్రశంసించారు. ఐదున్నరేళ్ల నుంచి రాష్ట్రంలో నియంత పాలన నడుస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ అంటే చాలా మంది భయపడుతున్నారని తెలిపారు. రాజకీయ నేతలు కూడా వణుకుతున్నారని.. కానీ మీరు కేసీఆర్‌ను ఢీ కొట్టి పోరాడుతున్నారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులు జీతాలు ఇవ్వకుండా వేధించడం సరికాదని బీజేపీ నేత వివేక్ విమర్శించారు. కార్మికుల్లో చీలిక తీసుకొచ్చేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయత్నించారని ఆరోపించారు. కానీ మీరు ఒక్కటే, ఏకతాటిగా సమ్మె చేసి.. ఐక్యత ఏంటో నిరూపించారని కొనియాడారు. ఉద్యమకారులపై కేసులు పెట్టి అణగదొక్కడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని దుమ్మెత్తిపోశారు. ఆర్టీసీ ప్రైవేట్ పరం చేసేందుకే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రయత్నిస్తున్నారని బిజెపినేత, మాజీ ఎంపి వివేక్ ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ నియంత పాలన చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం జరిగేపోరాటానికి ప్రజలు కూడా మద్దతు తెలపాలని వివేక్ కోరారు. ఆర్టీసీ కార్మికులుచేసే పోరాటానికి అన్ని వర్గాలు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం వల్ల ఎంతో మంది ఆర్టీసీ కార్మికులు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కోదండరాం సహా మిగతా నేతలపై కేసులు పెట్టి వేధించారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం వస్తే.. సీఎం సీటుపై కూర్చొని సబ్బండ వర్గాలను వేధిస్తున్నారని మండిపడ్డారు. డీజిల్‌పై వ్యాట్ ఎందుకు బానిస సంకెళ్లు తెంచేందుకు పోరుబాట పట్టిన కార్మికులకు మద్దతుగా అండగా ఉంటామని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మె దేనికి నిదర్శమని ప్రశ్నించారు. ఒక కుటుంబం ప్రయోజనం కోసమా..? స్వ రాష్ట్రం కోసం పోరాడింది అని గుర్తుచేశారు. ఆర్టీసీని విలీనం చేయాలంటే మేనిఫెస్టోలో లేదని కాకమ్మ కబుర్లు చెప్తున్నారని విమర్శించారు. డీజిల్‌పై వ్యాట్ ఎందుకు ఎత్తివేయరని ప్రశ్నించారు. సకల జనుల సమరభేరీ సభకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. ప్రభుత్వ వైఖరి సరికాదని విమర్శించారు. ఆర్టీసీ సమ్మెకు కాంగ్రెస్ నేతలు వీహెచ్, రేవంత్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నుంచి వివేక్, జితేందర్ రెడ్డి, తెలంగాణ జనసమితి అధినేత కోదండరాం, టీడీపీ కమిటీ అధ్యక్షుడు రమణ, తీన్మార్ మల్లన్న వామపక్ష నేతలు తదితరులు మద్దతు తెలిపారు.

# పనిచేస్తున్న అధికారుల హెచ్చరికలు

### వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణంలో పురోగతి

జనగామ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): స్వచ్ఛ జనగామ జిల్లాగా మార్చేందుకు ప్రతి ఇంట్లో మరుగు దొడ్డి నిర్మించుకోవాలని డీపీవో అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పంచాయితీ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల వారీగా ప్రజాప్రతినిధులు, అధికారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనుల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. గ్రామాల వారీగా అధికారులు, సిబ్బంది ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు లబ్దిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్డి లేని ఇంటికి రేషన్ సరుకుల సరఫరాను నిలిపివేయనున్నట్లు గతంలో చేసిన హెచ్చరికలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. మరుగుదొడ్డి లేని ఇంటికి రేషన్ నిలిపివేసేలా చూడాలని, అలాగే మరుగుదొడ్డి లేని రేషన్ షాపుల అనుమతిని తొలగించనున్నామని తెలిపారు. రేషన్ డీలర్లు గ్రామానికి ఆదర్శంగా నిలవాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారిని ఇప్పటికైనా గుర్తించి మంజూరీ ఇప్పించి వెంటనే నిర్మించడానికి సహకారాలను కోరారు. మరుగుదొడ్లను నిర్మించు కోకుంటే రేషన్ నరుకులతో పాటు పెన్షన్, షాదీముబారక్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను నిలిపివేస్తామని అన్నారు. అన్ని గ్రామాలకు మరుగుదొడ్లను నిర్మించాలనే టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు అనేక గ్రామాల్లో నిర్మాణాలు వివిధ దశలో ఉన్నట్లు తెలిపారు. జనగామను బహిర్గత మలమూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా అధికారులు పనిచేస్తున్నారని, దీనికి ప్రతీఒక్కరు తోడ్పాటును అందించాలని కోరారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12వేలను అందించడం జరుగుతుందన్నారు. ప్రతీఇంటికి మరుగుదొడ్డి ఉండాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రభుత్వంనుంచి వచ్చే సంక్షేమ పథకాలు గ్రామానికి నిలిపివేస్తామని పేర్కొన్నారు.

## వంతెనను వదల్లేదు

### ఢిల్లీలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీ చోరీ!

న్యూఢిల్లీ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): ఓ బ్రిడ్జీని దొంగలు దోచుకెళ్లారు అంటే ఎవరైనా నమ్ముతారా? నమ్మకపోగా..జోక్ అనుకుంటారు. కానీ ఇది నిజం. పాదచారుల కోసం ప్రభుత్వం నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జీని దొంగలు దోచుకుపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇది జరిగింది. వినటానికి ఇది చిత్రమనిపించినా ఇది అక్షరాలా జరిగింది.సౌత్ సెంట్రల్ ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం వద్ద రోడ్డును దాటేందుకు పాదచారుల సౌకర్యార్థం ఎనిమిది సంవత్సరాల క్రితం 2010లో అంటే ఒక ఫుట్ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. రెండేళ్ల క్రితం పీడబ్ల్యూడీ ఈ ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని మూసివేసింది. దీని గురించి అందరూ పట్టించుకోవటం మానేశారు. దీంతో కొద్ది కొద్దిగా ఈ బ్రిడ్జ్ పార్ట్ లను కనిపించకుండా పోతున్నాయి. అంటే చోరీకి గురవుతున్నాయి. ఎలివేటర్ స్విచ్, రెయిలింగ్ లతో పాటు ఆఖరికి ఇటుకలను కూడా దొంగలు వదల్లేదు. రూ.4 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఈ బ్రిడ్జిని గతంలో 10 వేల మంది వరకూ పాదచారులు వినియోగించేవారు. బ్రిడ్జ్ చోరీ గురించి తమకు ఎటువంటి సమాచారం గానీ..నివేదికలు గానీ తమకు రాలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ బ్రిడ్జ్ ని మూసివేసిన తరువాత ఈ రోడ్డుపై ప్రమాదాలు పెరిగాయని..ఇప్పటికైనా ఈ బ్రిడ్జిని పునరుద్ధరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# తెలంగాణలో క్రీడాకారులకు ప్రోత్సాహం

### ధర్మపురి క్రీడాకారులను అబినందించిన మంత్రి కొప్పుల

కరీంనగర్,అక్టోబర్31(నేటినిజంప్రతినిధి): జాతీయ స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందించారు. కరీంనగర్ ఉమ్మడిజిల్లా తరపున ఈనెల 25, 26 తేదీల్లో సంగారెడ్డిలో జరిగిన 65వ రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19 వాలీబాల్ పోటీలలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామానికి చెందిన ఎంపెల్లి రాజు, జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలానికి చెందిన గండ్ర ఆమని అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులలో రాజు మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో, ఆమని తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. వీరిద్దరు కూడా ధర్మపురి నియోజకవర్గం చెందిన క్రీడాకారులు. కరీంనగర్ క్యాంపు ఆఫీసులో బుధవారం కొప్పుల ఈశ్వర్ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించలేదని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్‌లో వీరు మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు వెంకటేష్ నేత, వాలీబాల్ కోచ్ మారపెల్లి కృష్ణారెడ్డి, బాయ్స్ కోచ్ తమ్మనవేని కుమార్, బాలికల కోచ్ బైకాని కొమురయ్య, వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు మిట్ట భరత్, సీనియర్ క్రీడాకారుడు మ్యాకల కోమల్ పాల్గొన్నారు




మహబూబాబాద్ జడ్పీ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపి మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు తదితరులు

## మేనిఫెస్టోలో లేని అంశాలను ఎందుకు అమలు చేస్తున్నారు

### మెగా కృష్ణారెడ్డికి బస్సులు ఇస్తామని చెప్పారా? సకలజనభేరీలో రేవంత్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): మేనిఫెస్టోలో లేని అనేక అంశాలను అమలు చేస్తున్నామన్న కెసిఆర్, ఆర్టీసీ విలీనాన్ని ఎందుకు పరిగణించడం లేదని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. అలాగే మేనిఫెస్టోలో లేని అంశాలను ఎందుకు చేస్తున్నారని కూడా ప్రశ్నించారు. గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న తెలంగాణ ఆర్టీసీ కార్మికులు బుధవారం సకల జనుల సమరభేరికి పిలువునిచ్చారు. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ సభలో ఆర్టీసీ కార్మికులు, విపక్ష పార్టీల నేతలు భారీ ఎత్తున హాజరయ్యారు. సకల జనుల సమరభేరి సభలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శలు గుప్పిం చారు. విలీనం అంశం తమ మేనిఫెస్టోలో లేదని చెప్తున్న కేసీఆర్ డీజిల్ మీద 27.5 శాతం వ్యాట్ ఎందుకు వేస్తున్నారని.. ఇది మేనిఫెస్టోలో ఉందా అని ప్రశ్నించారు. 20 శాతం బస్సులను ప్రైవేటీకరణ చేస్తామని చెప్తున్న ముఖ్యమంత్రి.. వాటిని మేఘా కృష్ణారెడ్డికి ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పారా అని చురకలంటించారు. ఆయన మాట్లాడుతూ.. 'విలీనం అంశం మా మేనిఫెస్టోలో లేదని.. ఊసరవెల్లి ఎర్రబెల్లి అంటారు. సీఎం కేసీఆర్ కూడా విలీనం అంశం మా మేనిఫెస్టోలో లేదు అంటారు.. మరి మీ కొడుకు, కూతురు, అల్లుడుకు మంత్రి పదవులు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పారా. 50 వేల కార్మికుల కుటుంబాలకు మద్దతుగా నాలుగు కోట్ల తెలంగాణ సమాజం మద్దతుగా నిలించింది. ఏ స్వేచ్ఛ కోసం తెలంగాణ ప్రజలు పోరాడారో.. మళ్లీ నేడు అదే స్వేచ్ఛ కోసం పోరాటం చేయాల్సి వస్తోంది. సకలజనుల సమరభేరికి కోర్టు అనుమతిచ్చి 24 గంటలు గడువకముందే వందల కిలోమీటర్ల నుంచి కార్మిక సోదరులు సరూర్‌నగర్ గ్రౌండ్‌లో కదం తొక్కారు. ఇది తెలంగాణ ప్రజల స్ఫూర్తి' అని రేవంత్ అన్నారు.




ఇందిర వర్ధంతిని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని శక్తిస్థల్ వద్ద నివాళి అర్పించిన కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ.

# ఇందిరకు నివాళి అర్పించిన రాహుల్

### ఆమె శక్తివంతమైన మహిళగా అభివర్ణన

న్యూఢిల్లీ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని, తన నాన్నమ్మ ఇందిరా గాంధీకి రాహుల్ గాంధీ నివాళులర్పించారు. ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం ఉదయం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆమె సమాధి శక్తిస్థల్‌కు చేరుకొని పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. మా నాన్నమ్మ, భారత మాజీ ప్రధాని వర్ధంతికి ఇప్పుడే నివాళులు అర్పించాను. నా జీవితంలో ఆమె అంత శక్తివంతమైన మహిళను చూడలేదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆమె తీసుకున్న నిర్ణయాలు, చేసిన సాహసాలు ఎవరి వల్ల కావని ఆయన గుర్తు చేశారు. రాహుల్‌తో పాటు ఆయన తల్లి, ఏఐసీసీ గౌరవాధ్యక్షు రాలు సోనియాగాంధీ, మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ లీడర్ మన్మోహన్ సింగ్ తదితరులు శక్తిస్థల్‌కు చేరుకొని ఇందిరా సమాధి వద్ద నివాళులు అర్పించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరి చ్పోలేమని ఆమె అన్నారు. ఇందిరాగాంధీ భారతదేశానికి ఒకేఒక్క మహిళా ప్రధాని కావడం విశేషం. ఆమె రెండు సార్లు దేశానికి ప్రధానిగా సేవలు చేశారు. ఇందిరా గాంధీ అక్టోబర్ 31, 1984లో తనకు భద్రతగా ఉన్న ఇద్దరు సిబ్బంది చేతిలో హతమయ్యారు.

## గ్రామాల్లో పట్టని స్వచ్ఛత

### పారిశుధ్య సమస్యలతో విషజ్వరాలు

వరంగల్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలే జ్వరాలకు ప్రధాన కారణమని వైద్యాధికారులు మరోమారు హెచ్చరించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తవేసి, కాలువలను శుభ్రం చేయకపోవడం వల్లనే దోమలు వృద్ధి చెందీ డెంగ్యూ, మలేరియా లాంటిజ్వరాలు వ్యాపిస్తున్నాయని అన్నారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెంది కంపుకొడుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసిన అపరిశుభ్ర ప్రదేశాలు దర్శనమిస్తున్నాయి.

ప్రజల్లో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, దోమల వృద్ధి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత తదితర విషయాలపై వైద్య అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉన్నా అవిధంగా జరగడం లేదు. పంచాయతీ అధికారులు గ్రామంలోని మురుగు నీటి పారుదల, అపరిశుభ్ర ప్రదేశాలు, నీటి కుంటలు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలకు శాపంగా మారింది.

దీంతో ఇంటింటికి ఇద్దరు ముగ్గురు చొప్పున జ్వరాలతో ఆసుపత్రులలో చికిత్స పొందున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు గ్రామంలో పర్యవేక్షించి పారిశుధ్య సమస్యలపై చర్యలు చేపట్టాల్సి అవసరం ఉంది. జ్వరాలతో బాధపడుతున్నవారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో మరికొంత మంది విష జ్వరాలతో అలమటిస్తుండగా ఇటీవల అక్కడ వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుధ్య సమస్యలే కారణం అని వైద్యులు తెలిపారు.

# స్వచ్ఛ గ్రామాలపై రాజీలేదు

### ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సిందే: ఎర్రబెల్లి

మహబూబాబాద్,అక్టోబర్31 (నేటినిజంప్రతినిధి) గ్రామాల పరిశుభ్రతకు సంబంధించిన విషయంలో ఎలాంటి రాజీలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామిణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. 30రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామనలు స్వచ్ఛతకు చేరువ చేయాలన్నారు. మహబూబాబాద్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, మహిళా సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందుకువెళ్లి గ్రామాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. గ్రామాలను పోటీపడి బాగు చేయాలన్నారు. ఇందులో ఎలాంటి రాజీ తగదన్నారు.

# ఎమ్మెల్యేతో సౌతాఫ్రికా నేతల భేటీ

జగిత్యాల,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని టీఆర్ఎస్ సౌతాఫ్రికా శాఖ అధ్యక్షులు నాగరాజు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. తననుఇంటికొచ్చి కలవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మీరు చేసిన సేవ మేమెప్పటికీ మరవమని ఆయన పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ వారు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విపరీతంగా ప్రచారం చేశారు. సోషల్ మీడియాను వేదిక చేసుకొని వారు..

టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతమయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే పురపాలక ఎన్నికల్లో నాగరాజుప్రత్యక్షంగా ప్రచారం నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎన్ఆర్ఐ సౌతాఫ్రికా అధ్యక్షులు గుర్రాల నాగరాజు, ఎన్ఆర్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై ఎన్జీటీ విచారణ

న్యూఢిల్లీ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో విచారణ జరిగింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల సామర్థ్యాన్ని పెంచారని, పర్యావరణ అనుమతులకు ఎలాంటి సవరణలూ చేయలేదని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై వాదనలు విన్న ఎన్జీటీ ప్రభుత్వ వివరణ కోరింది. అయితే వివరణ ఇచ్చేందుకు 2 వారాల సమయం కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనికి అంగీకరించిన ఎన్జీటీ ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 13కి వాయిదా వేసింది. కాగా, గతంలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఎన్జీటీలో అనేక పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఆ అడ్డంకులన్నీ అధిగమించి ప్రాజెక్టు పనులను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేస్తోంది.

## నేడు సదరం క్యాంపు

మేడ్చల్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ):: మల్కాజిగిరి ప్రభుత్వ దవాఖానలో నవంబర్ 1న సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సదరం క్యాంపులో ఆర్థో(ఓహెచ్) విభాగంలో 100 మందికి మాత్రమే పరీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డుతో రావాలని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

